**విలేకరులు కావలెను**

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక. 71 | బుధవారం | 7.అక్టోబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue. 71 | Wensday | 7.10.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |



## సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తుల ప్రమాణం

2

# 45 ఎకరాలు తేల్చాలి

## వెంటనే సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలి

- గుర్తించిన భూమిని అర్హులైన రైతులకు పంపిణీ చేయాలి
- జూన్ 2లోగా అమరవీరుల కాలనీ పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్



> సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో ఆచూకీ లభించని 45 ఎకరాల భూమిని గుర్తించేందుకు వెంటనే సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 22–ఏ భూముల అంశంపై గత నెల 16న శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం ఆదేశించిన విచారణ పురోగతిపై మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోదీ పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు.

**హైదరాబాద్:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో ఆచూకీ లభించని 45 ఎకరాల భూమిని గుర్తించేందుకు వెంటనే సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 22–ఏ భూముల అంశంపై గత నెల 16న శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం ఆదేశించిన విచారణ పురోగతిపై మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోదీ పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు ఏర్పాటు చేసిన కమిటీ, ధరణి అక్రమాలపై విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విచారణ పురోగతిని కమిటీ సభ్యులు సీఎంకు వివరించారు.

### రికార్డుల్లో 388 ఎకరాలు.. క్షేత్రస్థాయిలో 343 ఎకరాలే

ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో రికార్డుల ప్రకారం 388 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే తాజా సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని వివరించారు. రికార్డుల్లో నమోదైన భూమికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉన్నట్లు వెల్లడించారు. దీంతో ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి 45 ఎకరాల భూమి ఆచూకీ తేల్చేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. సర్వే నంబర్ 325 సమీపంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున.. వాటికి సంబంధించిన రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. సర్వేలో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

### అమరవీరుల కుటుంబాలకు కాలనీ

తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించాలని సీఎం సూచించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### వెలికట్టలో ఎడ్యుకేషన్ హబ్

కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములను మినహాయించి మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటిని జాగ్రత్తగా వినియోగించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మల్లన్నసాగర్ నీటిని అనధికారికంగా వినియోగిస్తున్న వారిని గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




## నెలకు రూ.2 వేల కోట్ల పనులు జరగాలి

- ప్రస్తుతం రూ.1,345 కోట్ల పనులు.. వేగం పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఐకానిక్ భవనాల్లో జాప్యం వద్దు.. ఔటర్ రింగ్‌రోడ్డుపై కేంద్రంతో సమన్వయం

6

2

## కాంక్రీట్‌తో గుడి కడుతూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నరు



- రాజన్న ఆలయాన్ని కృష్ణ శిలలతో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మించాలి
- రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ హిట్ జోడీ కాదు.. ఇడుపు కాయితం జోడీ
- వారికి న్యాయం జరిగే వరకు మా పోరాటాన్ని ఆపేది లేదు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

## 25 ఏళ్ల మోడీ నాయకత్వానికి కేంద్ర కేబినెట్ ప్రశంస

- 'దేశమే ప్రథమం.. పౌరుడే తొలి ప్రాధాన్యం' విధానంతో పాలన
- ఐటీ, మౌలిక వసతుల రంగాల్లో కీలక నిర్ణయాలు.. రూ.10 వేల కోట్ల ఎంఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌కు ఆమోదం

2



## భూత కణాల అన్వేషకుడికి నోబెల్

- భౌతికశాస్త్రంలో ఆస్ట్రోఫిజికల్ న్యూట్రినోల గుర్తింపునకు పురస్కారం
- ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీలో కీలక పాత్ర పోషించిన ఫ్రాన్సిస్ హాల్జెన్

6



2

## వైమానిక దళానికి కొత్త చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

- అక్టోబర్ 31న బాధ్యతల స్వీకరణ
- 2028 డిసెంబరు 31 వరకు కొనసాగనున్న ఎయిర్ మార్షల్



## అసత్య ప్రచారం రాహుల్‌కి అలవాటైంది



2

- ప్రతిపక్ష నేతకురాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలు
- ఈసీపై ఆరోపణలతో ప్రజల్లో అనుమానాలు రేకెత్తించే ప్రయత్నం
- ఫారం–6పై దుష్ప్రచారం: కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి




## ఏ పార్టీ భేటీకి సమయం కోరలేదు

- అధికారిక ప్రతినిధి ద్వారా ముందస్తుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి
- 240 మంది ఎంపీలతో పార్లమెంట్ అనెక్స్‌లో భేటీ ప్రతిపాదన అసాధారణం
- వినతిపత్రం స్వీకరణకు సీనియర్ అధికారిని పంపుతాం: సీఈసీ
- రాహుల్ ధర్నాపై కేంద్రం ఎన్నికల సంఘం ప్రకటన

6

2

## ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు

### నరేంద్ర మోడీ, అమిత్ షా, భగవత్, సీఈసీ

- 'ఓటు చోరీ' కుట్రకు పాల్పడ్డారు.. ఇది దేశద్రోహమే
- ఎంపీలను కలవడానికి ఈసీకి అభ్యంతరం ఏమిటి?
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

2

6

> నరేంద్ర మోడీ, అమిత్ షా, మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు. ఈ విషయం దేశంమొత్తానికి తెలుసు. కానీ మేం రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రయత్నిస్తున్నాం. కొద్దిసేపటి క్రితం దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లను కలవడానికి నిర్వచన్ సదన్(ఎన్నికల ప్రధాన కార్యాలయం) వైపు వెళ్లాం. అయితే, ఈసీ కార్యాలయానికి కేవలం 50 గజాల దూరంలో పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. నాకు అర్థం కాని విషయం ఏంటంటే, కోట్లాది మంది ప్రజలు ఓట్లేసి గెలిపించిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో మాట్లాడటానికి ఈసీకి ఉన్న అభ్యంతరం ఏంటి? ఎన్నికల కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు? పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? ప్రజల గొంతుకగా వచ్చిన ఎంపీలను కలవడానికే సీఈసీ నిరాకరిస్తే దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితి ఏంటి? – రాహుల్ గాంధీ




## అర్హులైన సింగరేణి కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాలు



> సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

- 1,250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం పట్టాల పంపిణీ
- నెలలోపు ఆక్రమణదారుల ప్రాథమిక జాబితా
- 15 రోజుల్లో 300 డిపెండెంట్ ఉద్యోగాల ఉత్తర్వులు
- ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ బోర్డులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



## రాజ్యాంగాన్ని అపహాస్యం చేయకండి రాహుల్!

- తెలంగాణలో అప్రజాస్వామిక పాలనపై స్పందించాలి
- ఆధారాలతో ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతను జైలుకు పంపుతున్నారు
- 'ఎక్స్'లో కాంగ్రెస్ అగ్రనేతకు కేటీఆర్ పోస్ట్

2

## ప్రజల నెత్తిన కరెంటు ఛార్జీల భారమా?

- వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- పెద్దుత్తున ప్రజాఉద్యమానికి శ్రీకారం
- మాజీ మంత్రి హరీశ్ రావు



## నెలకు రూ.2 వేల కోట్ల పనులు జరగాలి

**అమరావతి:** రాజధాని అమరావతిలో ప్రతినెలా రూ.2 వేల కోట్ల విలువైన పనులు జరిగేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాజధానిలోని 152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సీఎంకు వివరించారు. గత నెలలో రూ.1,345 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. పనుల వేగాన్ని మరింత పెంచి నెలవారీగా రూ.2 వేల కోట్ల స్థాయికి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు.రాజధాని నిర్మాణంలో ఎక్కడా అశ్రద్ధ, నిర్లక్ష్యానికి తావులేకుండా పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఐకానిక్ భవనాల నిర్మాణంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఆదేశించారు. ఔటర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టును కూడా పట్టాలెక్కించాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతి నగరాభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.1,200 కోట్లను విడుదల చేసింది. అమరావతి కేపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద 2026–27 ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికానికి ఈ నిధులను కేటాయించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఆర్థిక సాయంతో చేపడుతున్న పనులకు ఈ నిధులను వినియోగించనున్నారు.ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏ పార్టీ భేటీకి సమయం కోరలేదు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఢిల్లీలో నిర్వహించిన నిరసనపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ కూడా ఎన్నికల సంఘంతో భేటీకి సమయం కోరలేదని స్పష్టం చేసింది. ఈసీని కలవాలంటే సంబంధిత పార్టీ అధికారిక ప్రతినిధి ముందుగా అపాయింట్‌మెంట్ కోరాలని తెలిపింది. భేటీ తేదీ, సమయాన్ని ఇరు పక్షాల పరస్పర అంగీకారంతో ఖరారు చేయడం గతేడాది నుంచి అమల్లో ఉన్న విధానమని ఈసీ పేర్కొంది. రాజకీయ పార్టీలు తమను ఎప్పుడైనా కలవాలని కోరవచ్చని, అయితే అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి భేటీ తేదీ, సమయాన్ని నిర్ణయిస్తామని వెల్లడించింది.

### ఎంపీల ప్రతిపాదనపై ఈసీ అభ్యంతరం

240 మంది ఎంపీలతో పార్లమెంట్ అనెక్స్‌లో భేటీ నిర్వహించాలంటూ కాంగ్రెస్ నుంచి ప్రతిపాదన వచ్చినట్లు ఈసీ తెలిపింది. ఇలాంటి ప్రతిపాదన అసాధారణమైనదని పేర్కొంది. ఎంపీలు సమర్పించే వినతిపత్రాన్ని స్వీకరించేందుకు సీనియర్ అధికారిని పంపుతామని స్పష్టం చేసినప్పటికీ.. ఆ ప్రతిపాదనను ఎంపీలు తిరస్కరించినట్లు వెల్లడించింది.భేటీ కోసం ముందస్తుగా అధికారికంగా సమయం కోరితే, తమ సౌకర్యాన్ని బట్టి తేదీ, సమయాన్ని ఖరారు చేస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. రాహుల్‌గాంధీ, ఇతర విపక్ష ఎంపీల నిరసన నేపథ్యంలో ఈసీ ఈ వివరణ విడుదల చేసింది.

## 'భూత కణాల' అన్వేషకుడికి నోబెల్

**స్టాక్‌హోమ్:** భౌతికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ పురస్కారం బెల్జియన్–అమెరికన్ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు దక్కింది. ఖగోళ మూలం కలిగిన అత్యంత శక్తిమంతమైన న్యూట్రినోల ఆవిష్కరణతో పాటు ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ అభివృద్ధిలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. న్యూట్రినోలను సాధారణంగా 'భూత కణాలు'గా అభివర్ణిస్తారు. విద్యుదావేశం లేకపోవడం తోపాటు ఇతర పదార్థాలతో చాలా అరుదుగా మాత్రమే చర్య జరపడం వల్ల వీటిని గుర్తించడం అత్యంత క్లిష్టం. మన చుట్టూ నిరంతరం ప్రయాణిస్తున్నప్పటికీ.. వాటి ఉనికిని గుర్తించడం శాస్త్రవేత్తలకు సవాలుగా నిలుస్తోంది. ఈ కణాలను గుర్తించేందుకు దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచును ఉపయోగించే విధానాన్ని అభివృద్ధి చేయడంలో హాల్జెన్ కీలక పాత్ర పోషించారు. మంచులో ఏర్పాటు చేసిన కాంతి సెన్సార్ల సాయంతో న్యూట్రినోల జాడలను గుర్తించే ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటులో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఈ పరిశోధన ద్వారా విశ్వంలోని అత్యంత శక్తిమంతమైన ఖగోళ ఘటనలపై అవగాహనకు కొత్త మార్గాలు తెరుచుకున్నాయి.

### వరుసగా నోబెల్ ప్రకటనలు

నోబెల్ పురస్కారాల ప్రకటనలు కొనసాగనున్నాయి. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యంలో పురస్కార గ్రహీతల పేర్లను వెల్లడించనున్నారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటిస్తారు. అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ పురస్కారం నగదు బహుమతి 12 లక్షల డాలర్లు (సుమారు రూ.11.5 కోట్లు). స్వీడన్ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం 1901 నుంచి ఈ పురస్కారాలను అందిస్తున్నారు.

## వైమానిక దళానికి కొత్త చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

**న్యూఢిల్లీ:** భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తదుపరి చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎయిర్ చీఫ్ మార్షల్‌గా సేవలందిస్తున్న అమర్‌ప్రీత్ సింగ్ అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం అశుతోష్ దీక్షిత్ 'చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్'గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన 2028 డిసెంబరు 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.1966 డిసెంబరులో జన్మించిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబరులో భారత వైమానిక దళంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సర్వీసులో వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా సేవలందిస్తున్నారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ తదితర కీలక సైనిక కార్యకలాపాల్లో ఆయన విధులు నిర్వహించారు. మిరాజ్–2000, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి పలు యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఆయనకు ఉంది. ఇప్పటివరకు 3,500 గంటలకు పైగా విమానయాన అనుభవాన్ని ఆయన సొంతం చేసుకున్నారు.

## సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తుల ప్రమాణం

- జస్టిస్ సునీతా అగర్వాల్, దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, అపరేశ్‌కుమార్ సింగ్ బాధ్యతల స్వీకారం
- న్యాయమూర్తుల సంఖ్య 37కి.. మహిళా జడ్జీల సంఖ్య మూడుకు



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ మంగళవారం పదవీ ప్రమాణం చేశారు. సాయంత్రం 3.30 గంటలకు సుప్రీంకోర్టు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ వారికి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వివిధ హైకోర్టుల అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు, కొత్త న్యాయమూర్తుల కుటుంబసభ్యులు హాజరయ్యారు. ముగ్గురు కొత్త న్యాయమూర్తులు బాధ్యతలు స్వీకరించడంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరింది. వీరిలో మహిళా న్యాయమూర్తులు ముగ్గురు ఉన్నారు.ఔ సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల గరిష్ఠ సంఖ్యను సీజేఐతో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ కేంద్ర కేబినెట్ ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా మే 16న ఆర్డినెన్స్ జారీ అయింది. అనంతరం జూన్ 2న ఒకేసారి ఐదుగురు న్యాయమూర్తులను సుప్రీంకోర్టుకు నియమించారు. తాజాగా మంగళవారం మరో ముగ్గురు న్యాయమూర్తులు బాధ్యతలు స్వీకరించడంతో ఈ ఏడాది ఇప్పటివరకు సుప్రీంకోర్టులో ఎనిమిది మంది కొత్త జడ్జీల నియామకం పూర్తయింది. ఇదే సమయంలో నలుగురు న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. నవంబరు 29న జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ కూడా పదవీ విరమణ చేయనున్నారు.

# కాంక్రీట్‌తో గుడి కడుతూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నరు

**వేములవాడ:** వేములవాడ రాజన్న ఆలయాన్ని కాంక్రీట్‌తో నిర్మించడం ద్వారా భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆలయ నిర్మాణం ఆలస్యమైనా ఫర్వాలేదని, ఆగమశాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో వెయ్యేళ్లపాటు నిలిచేలా నిర్మించాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన ఆమె.. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.కోడె మొక్కులకు ప్రసిద్ధి చెందిన వేములవాడ ఆలయంలో కోడెల సంరక్షణపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కవిత విమర్శించారు. కోడెలు మృత్యువాత పడుతున్నా సరైన పశుగ్రాసం అందించడం లేదని ఆరోపించారు. చనిపోయిన కోడెలకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు కూడా నిర్వహించడం లేదన్నారు. హిందుత్వం గురించి మాట్లాడే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రసాద్ పథకంలో దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ ఆలయాన్ని చేర్చేందుకు కేంద్ర మంత్రి ఎందుకు కృషి చేయలేదని నిలదీశారు. రాజన్న ఆలయానికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు.వేములవాడకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నా మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని కవిత అన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని సూచించారు. తన తల్లిదండ్రుల వివాహం వేములవాడలోనే జరిగిందని, ఈ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.సిరిసిల్ల ప్రాంతానికి సాగునీరు అందించాలికాళేశ్వరం ప్రాజెక్టుతో సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భావించినా.. ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదని కవిత ఆరోపించారు. రుద్రంగిలో 2018లో శంకుస్థాపన చేసిన రిజర్వాయర్ పనులు ఇన్నేళ్లయినా



పూర్తి కాలేదన్నారు. ఆ ప్రాజెక్టు పూర్తయితే 63 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.దూంపేట వద్ద రిజర్వాయర్ నిర్మించి నీటిని ఎత్తిపోస్తే కథలాపూర్, మేడిపల్లి ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఎర్రకుంట, పటేల్ చెరువులను అనుసంధానించి రిజర్వాయర్ నిర్మిస్తే వేములవాడ, చందుర్తి, కోనరావుపేట మండలాలకు నీరు అందించే అవకాశం ఉందన్నారు. మిడ్‌మానేరు, అప్పర్ మానేరు లింక్ పనులను పూర్తి చేస్తే లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు.సెస్ అవినీతిపై విచారణ జరపాలిసిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)లో జరిగినట్లు ఆరోపిస్తున్న రూ.32 కోట్ల అవినీతిపై ప్రభుత్వం విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో ఈ అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్నాయని, అలాంటప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సెస్‌లో అగ్నిప్రమాదం జరగడం, ఫైళ్లు దగ్ధమయ్యాయని చెప్పడం వెనుక అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం ఉందని ఆరోపించారు.సహకార విద్యుత్ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా ఉన్న సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. నేతన్నలు, చేనేత కార్మికులు అధికంగా ఉన్న సిరిసిల్లలో యార్న్ డిపో ఏర్పాటు చేయకుండా వేములవాడలో ఏర్పాటు చేయడం రాజకీయ దర్పాన్ని ప్రదర్శించడమేనన్నారు.సిరిసిల్లలో జేఎన్‌టీయూ ఏర్పాటైనా ల్యాబ్ సౌకర్యాల కోసం జగిత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని కవిత విమర్శించారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు హాస్టల్‌లో కనీస వసతులు లేవని, ఒక్కో గదిలో 16 మంది ఉంటున్నారని ఆరోపించారు. గల్ఫ్ బాధితులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వైజరీ కమిటీ కూడా పనిచేయడం లేదన్నారు. గల్ఫ్‌లో మృతి చెందిన 112 మంది కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లకు రైలు సౌకర్యం కల్పించాలన్న దశాబ్దాల డిమాండ్ సాధన కోసం తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. మంజూరైన 15 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి పనులను పూర్తి చేసేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ చూపాలని కోరారు.'

### హిట్ జోడీ కాదు.. ఇడుపు కాగితం జోడీ'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఉద్దేశించి కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారిద్దరినీ 'హిట్ జోడీ'గా అభివర్ణిస్తున్నారని, వాస్తవానికి అది 'ఇడుపు కాగితం జోడీ' అని ఎద్దేవా చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్ ఒకలా మాట్లాడుతుంటే, రేవంత్‌రెడ్డి మరోలా మాట్లాడుతున్నారని.. అలాంటప్పుడు వారిని హిట్ జోడీ ఎలా అంటారని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కవిత అన్నారు. రాష్ట్రంలో సాగులో ఉన్న కోటి 10 లక్షల ఎకరాల పంటలను కాపాడాలంటే నవంబరు వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే విద్యుత్‌ను అడుక్కొచ్చినా, కొనుక్కొచ్చినా రైతులకు సరఫరా చేయాల్సిందేనన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పార్టీలకు అతీతంగా రైతుల తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ప్రభుత్వం ప్రతి అంశానికీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలోనూ ప్రభుత్వం హామీ నెరవేర్చలేదన్నారు.

ఉర్దూ పత్రికలకు మండలానికి ఒక్కరికే అక్రిడిటేషన్ ఇస్తామనడం సరికాదని, ఉర్దూ భాషపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు.నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటంనేరెళ్ల బాధితుల పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. వారిని మరోసారి మోసం చేశారని కవిత ఆరోపించారు. సిరిసిల్ల సభలో న్యాయం చేస్తారని ఆశించిన బాధితులకు రూ.5 లక్షలు, రూ.10 లక్షల చొప్పున చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. బాధితులను వర్గాలుగా విభజించి పరిహారంలో వ్యత్యాసం చూపడం అన్యాయమన్నారు. నేరెళ్ల బాధితులు తనను కలిసి ముఖ్యమంత్రి హామీలతో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారని తెలిపారు. కేసులకు సంబంధించిన ఆధారాలు మాయం చేశారని ఆరోపించిన ఆమె.. అప్పటి జైలర్, డీఐజీ బాధితులపై నిర్వహించిన విచారణ నివేదికలు ఏమయ్యాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సిరిసిల్ల ఎస్పీ శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం, మూడు ఎకరాల భూమి, కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రధాన పార్టీలకు దీటుగా తెలంగాణ రక్షణ సేన ప్రజా సమస్యలపై ఉద్యమిస్తుందని తెలిపారు.

# ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నలుగురూ కలిసి దేశ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారని, 'ఓటు చోరీ' కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ దేశద్రోహమేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం విపక్ష ఎంపీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వచన్ సదన్' వరకు దాదాపు 300 మంది ఎంపీలు ర్యాలీగా బయలుదేరారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఆకాశవాణి భవన్, నీతి ఆయోగ్ కార్యాలయాల సమీపంలో పోలీసులు భారీగా బలగాలను మోహరించి ర్యాలీని అడ్డుకున్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు విపక్ష ఎంపీలను ముందుకు వెళ్లకుండా నిలువరించారు. దీంతో ఆకాశవాణి భవన్ కాంప్లెక్స్‌లోనే విపక్ష నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

### 'ఎంపీలను కలవడానికి ఈసీకి అభ్యంతరం ఏమిటి?'

ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ''మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు. ఈ విషయం దేశమంతటికీ తెలుసు. మేం మాత్రం రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం'' అని అన్నారు.''దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కలిసి సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు నిర్వచన్ సదన్ వైపు వెళ్లాం. కానీ ఎన్నికల సంఘం కార్యాలయానికి కేవలం 50 గజాల దూరంలోనే పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. కోట్లాది మంది ప్రజలు ఓటు వేసి గెలిపించిన ఎంపీలతో మాట్లాడేందుకు ఈసీకి ఉన్న అభ్యంతరం ఏమిటి? ఎన్నికల కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు? పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? ప్రజల గొంతుకగా వచ్చిన ఎంపీలను కలవడానికి సీఈసీ నిరాకరిస్తే దేశంలో ప్రజాస్వామ్యం పరిస్థితి ఏంటి?'' అని రాహుల్ ప్రశ్నించారు. విపక్షాల ర్యాలీని అడ్డుకునేందుకు సీఆర్‌పీఎఫ్, ఆర్‌ఏఎఫ్ సహా భారీగా భద్రతా బలగాలను మోహరించారని సీపీఐ ఎంపీ పి.సందోష్‌కుమార్ అన్నారు. సీఈసీ రాజీనామా చేయాల్సిందేనని విపక్ష నేతలు స్పష్టం చేశారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని, ఎన్నికల సంఘం తీరుపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ర్యాలీని అడ్డుకున్న అనంతరం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విపక్షాలు వెల్లడించాయి.

### ఎస్ఐఆర్, ఫారం–6 మార్పులపై దుమారం

ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తలపై విపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఎస్ఐఆర్‌లో భాగంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం–6లో చేసిన మార్పులపైనా ప్రతిపక్ష నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వ్యవహారంపై ఇతర రాజకీయ పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

### పోలీసుల అదుపులో రాహుల్, ప్రియాంక

ఆకాశవాణి భవన్ వద్ద విపక్షాల నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, పవన్‌ఖేరా, అమరీందర‌సింగ్‌తో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సీఈసీ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని విపక్ష నేతలు స్పష్టం చేశారు.

## 25 ఏళ్ల మోడీ నాయకత్వానికి కేంద్ర కేబినెట్ ప్రశంస

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా పాలనా ప్రస్థానాన్ని ప్రశంసిస్తూ కేంద్ర కేబినెట్ మంగళవారం తీర్మానం ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా, అనంతరం ప్రధానమంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడింది. 'దేశమే ప్రథమం.. పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో మోదీ ముందుకు సాగుతున్నారని పేర్కొంది.గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా మూడు పర్యాయాలు పనిచేసిన మోదీ.. అక్కడ అనేక విజయవంతమైన కార్యక్రమాలను అమలు చేశారని కేబినెట్ తెలిపింది. గుజరాత్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పలు పథకాలను అమలు చేస్తూ దార్శనికతతో ముందుకు సాగుతున్నారని పేర్కొంది. ప్రజల నుంచి విశేష ఆదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారని గుర్తు చేసింది.



### ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీకి ఆమోదం

ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రవాణా, మౌలిక వసతుల రంగాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.రవాణా రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణతో పాటు వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడంలో ఐటీలా కీలకంగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలులో సమన్వయ లోపాలను తగ్గించి పనులు వేగంగా పూర్తయ్యేలా ఈ సంస్థ దోహదపడుతుందని చెప్పారు.రూ.500 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టుల సాంకేతిక అర్హతలను ఐటీలా మదింపు చేస్తుందని వివరించారు.

### ఎంఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్ల గ్రోత్ ఫండ్

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఈక్విటీ పెట్టుబడులు అందించేందుకు రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ గ్రోత్ ఫండ్ ద్వారా ఎంఎస్ఎంఈలకు దీర్ఘకాలిక పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.దీంతో చిన్న, మధ్యతరహా సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈల పాత్రను మరింత బలోపేతం చేసేందుకు ఈ నిధి దోహదపడుతుందని కేంద్రం వెల్లడించింది.

# అర్హులైన సింగరేణి కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాలు

హైదరాబాద్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జీవో నంబర్ 76 ప్రకారం 1,250 ఎకరాల్లో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సింగరేణి ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, సంస్థ ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆయా ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులను భట్టి సానుకూలంగా విని, వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణలో ఉన్న నివాసితుల ప్రాథమిక జాబితా తయారీని నెలలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### నెహ్రూ హౌసింగ్ కాలనీకి ప్రణాళిక

ఇంతవరకు మైనింగ్ కార్యకలాపాలు చేపట్టని ప్రాంతాలను గుర్తించాలని భట్టి సూచించారు. ఉద్యోగులు, కార్మికుల ఇళ్ల నిర్మాణానికి అనువుగా ఆయా ప్రాంతాల్లో లేఅవుట్లు రూపొందించి 'నెహ్రూ హౌసింగ్ కాలనీ' నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 300 డిపెండెంట్ ఉద్యోగాల ఉత్తర్వులను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అభ్యర్థులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించిన సమస్యలపై మానవీయ కోణంలో ఆలోచించాలని సూచించారు. అధికారుల కమిటీ చేసిన సిఫార్సులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. సింగరేణి ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో అభివృద్ధి చేయాలని భట్టి ఆదేశించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత తేదీన మెడికల్ బోర్డు సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రులు శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, గండ్ర సత్యనారాయణరావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, గడ్డం వినోద్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజల నెత్తిన కరెంటు ఛార్జీల భారమా?

**హైదరాబాద్:** ఒకవైపు ఎల్‌నినో.. మరోవైపు నిత్యావసర ధరల పెరుగుదలతో ప్రజలు అల్లాడుతుంటే.. ప్రభుత్వం వారి నెత్తిన కరెంటు ఛార్జీల రూపేణా రూ.5,420 కోట్ల భారాన్ని మోపడం సరైంది కాదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ మంత్రులు సీహెచ్ లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితరులతో కలిసి మంగళవారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''దసరా, దీపావళి పండగల వేళ ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణం. విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన సొమ్మును వినియోగదారుల నుంచే వసూలు చేయాలను కోవడం ఎంతవరకు సమంజసం? బషీర్‌బాగ్ కాల్పులు జరిగి 26 ఏళ్లు అయింది. ఆ కాల్పుల ఘటన చూసి.. కరెంట్ కష్టాలకు చరమగీతం పాడాలని.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రావాలని.. తన పదవులకు కేసీఆర్ రాజీనామా చేసి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

కేసీఆర్.. అధికారంలోకి రాగానే విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. 2016–17 నుంచి 2021–22 వరకు ట్రూ–అప్ ఛార్జీలు రూ.12,718.40 కోట్లు వేయాలని ఈఆర్సీ చెప్పినా.. ఆ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు అనుమతించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది. ముందస్తు ప్రణాళికలు రూపొందిం చుకోవడంలో రేవంత్ సర్కారు విఫలమైంది. ప్రభుత్వం.. నిర్లక్ష్యంతో విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి.. ఆ భారాన్ని ప్రజలపై వేస్తోంది. దీన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రభుత్వం ఈ నిర్ణయం నుంచి వెనక్కు తగ్గాలి. లేకపోతే.. పెద్దఎత్తున ప్రజాఉద్యమానికి శ్రీకారం చుట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ పోరాటంలో కలిసి రావాలని సీపీఐ, సీపీఎంలను కోరుతున్నామని తెలిపారు.

# అసత్య ప్రచారం రాహుల్‌కి అలవాటైంది

**హైదరాబాద్:** దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారం చేయడం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. కనీసం చట్టపరమైన వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా కేంద్ర ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అనుమానాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల సంఘం వెంటనే ఇచ్చిన వివరణతో రాహుల్‌గాంధీ చేసిన దుష్ప్రచారం బయటపడిందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ రాహుల్ ఏదో ఒక వివాదానికి తెరతీస్తున్నారని ఆయన అన్నారు.2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో చేసిన ఆరోపణలకు సంబంధించి రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టుకు మూడు పేజీల క్షమాపణ పత్రం సమర్పించాల్సి వచ్చిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. మోదీ ఇంటి పేరుపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో క్రిమినల్ పరువునష్టం కేసులో దోషిగా




తేలిన విషయాన్ని ప్రస్తావించారు.''ఎన్నికల ప్రక్రియపై నిరాధార ఆరోపణలు చేయడం, ఇప్పుడు ఫారం–6 విషయంలో మరో అసత్య ప్రచారానికి తెరతీయడం కాంగ్రెస్ రాజకీయ ప్రచారంలో భాగమే. రాజ్యాంగ సంస్థలపై ప్రజలకు అపోహలు కలిగించేలా వ్యవహరించడం సరికాదు'' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## రాజ్యాంగాన్ని అపహాస్యం చేయకండి రాహుల్!

**హైదరాబాద్:** తెలంగాణలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతున్న సమయంలో దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణపై ప్రచారం చేయడం సరికాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కుటుంబ అవినీతిని ఆధారాలతో ప్రశ్నించినందుకే భారాస నేత మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ''మీరు ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణ గురించి ఉపన్యాసాలు ఇస్తున్నారు. మీరు ఎవరి పైనైనా నిరాధార ఆరోపణలు చేయొచ్చు. కానీ మా నాయకుడు ఆధారాలతో ప్రశ్నిస్తే జైలుకు పంపుతారా?'' అని ప్రశ్నించారు.తెలంగాణలో తమ పార్టీ ముఖ్యమంత్రి పాలనపై కాంగ్రెస్ అగ్రనేత దృష్టి సారించి, అప్రజాస్వామిక విధానాలను నియంత్రించాలని కేటీఆర్ కోరారు.




విధి నిర్వహణలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ టౌన్ కానిస్టేబుల్ దావసోత్ శంకర్ వైద్య ఖర్చులను తానే భరిస్తానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించారు. కానిస్టేబుల్ శంకర్ పూర్తిగా కోలుకునే వరకు ఆయన కుటుంబానికి అండగా ఉంటామని కేటీఆర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో కష్టపడి పనిచేస్తున్న సాధారణ పోలీసుల పరిస్థితిపై ఈ ఘటన తర్వాతైనా ప్రభుత్వం దృష్టి సారించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.



## ప్రజల ఆరోగ్యమే దేశ ప్రగతికి పునాది

- హైకోర్టు కాలనీలో ఘనంగా మెగా ఉచిత వైద్య శిబిరం
- పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్

**తొలివెలుగు, హయత్‌నగర్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా హైకోర్టు కాలనీ డివిజన్‌లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యమే దేశ ప్రగతికి పునాది అని అన్నారు. పేద, బలహీన వర్గాల ఆరోగ్య భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. 'సేవే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం' అనే స్ఫూర్తితో బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, ప్రేమ్‌నాథ్, సీనియర్ నాయకులు గోవిందాచారి, యాదగిరి, వెంకన్న, మహిళా నాయకురాలు పార్వతి, బీజేవైఎం నాయకులు అభిలాష్, రితిక్ పాల్గొన్నారు.

## టెలిగ్రామ్ టాస్క్‌ల పేరిట రూ.1.13 లక్షలు స్వాహా

- అధిక లాభాల ఆశచూపి నల్లగొండ యువకుడికి బురిడీ
- బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసుల కేసు



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** ఆన్‌లైన్‌లో టాస్క్‌లు పూర్తి చేస్తే భారీ లాభాలు వస్తాయని నమ్మించి నల్లగొండ జిల్లాకు చెందిన ఓ యువకుడి నుంచి రూ.1,13,450 కాజేసిన ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. దామరచర్ల మండలం నర్సాపురానికి చెందిన మాలోతు నవీన్ (27)కు సెప్టెంబరు 26, 27 తేదీల్లో 'అర్జున్ పటేల్ ఎల్ఎల్‌టీసీ 01' పేరుతో టెలిగ్రామ్‌లో సందేశాలు వచ్చాయి. టెలిగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తులు పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నవీన్‌ను నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు పలు దఫాలుగా మొత్తం రూ.1,13,450 జమ చేశాడు. అనంతరం తన పెట్టుబడితో వచ్చిన మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. అవతలి వ్యక్తుల నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. దీంతో నవీన్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నగదు ఏ ఖాతాల్లోకి బదిలీ అయింది, మోసానికి పాల్పడిన వ్యక్తుల వివరాలు తదితర అంశాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ షరీఫ్

- సమాజ అభివృద్ధికి సోదరభావమే పునాది
- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎంపీ మధుయాష్కీ, మల్‌రెడ్డి రాంరెడ్డి



**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్‌లో పవిత్ర గ్యార్వీ షరీఫ్ వేడుకలు భక్తిశ్రద్ధలు, సోదరభావ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐపీసీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. విభిన్న మతాలు, భిన్న విశ్వాసాలు సమాజానికి బలమని, అవి ఎట్టి పరిస్థితుల్లోనూ విభజనకు కారణం కాకూడదన్నారు. ప్రేమ, శాంతి, సోదరభావం, పరస్పర గౌరవమే సమాజ ప్రగతికి మూలస్తంభాలని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ శాంతియుత సమాజ నిర్మాణానికి అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, మైనారిటీ సీనియర్ నాయకుడు జానీమియా, గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# స్మార్ట్ కార్డులతో పారదర్శకంగా రేషన్ సేవలు

- ఆర్‌టీసీ కాలనీలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- పాల్గొన్న మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి



**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఎల్‌బీనగర్‌లోని ఆర్‌టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డితో కలిసి మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా రేషన్ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. 2026 ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి, మైనారిటీ సీనియర్ నాయకుడు జానీమియా, కాంగ్రెస్ నాయకులు షరీఫ్, అజయ్, కాలనీవాసి పెంటారెడ్డి పాల్గొన్నారు.

# టెలిఫోన్ కాలనీ అభివృద్ధికి కృషి

- మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి హామీ
- ఎమ్మెల్యేను కలిసిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు



**తొలివెలుగు, హయత్‌నగర్ :** మునగనూరు గ్రామంలోని టెలిఫోన్ కాలనీ అభివృద్ధికి, అక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. కాలనీలోని అంతర్గత రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై కాంగ్రెస్ నాయకుడు గుత్తా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేతో విస్తృతంగా చర్చించారు. కాలనీ ప్రగతికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ అధ్యక్షురాలు కే. సౌజన్య భారతి తెలిపారు. కాలనీ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- రంగనాయకుల గుట్ట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ నేతలు
- సౌకర్యాలు మెరుగుపర్చాలని అధికారులకు విజ్ఞప్తి

**తొలివెలుగు, హయత్‌నగర్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపర్చాలని బీజేపీ నాయకులు కోరారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రంగనాయకుల గుట్టలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి చిన్నారులకు అందుతున్న విద్యాబోధన, పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిన్నారుల ప్రాథమిక వికాసంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం ప్రజల మధ్య ఉండి కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, నాయకులు పార్వతి, గోవిందాచారి, జంజ్య నాయక్, మొగులయ్య, శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు అభిలాష్, రీతిక్ తదితరులు పాల్గొన్నారు.



## పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- గ్రామగ్రామానా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ
- పీఏసీఎస్ చైర్మన్ కాక మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ కాక మల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మెహర్ నగర్, పిల్లాయిపల్లి, భీమనపల్లి గ్రామాల్లో నూతన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచులతో కలిసి వారు లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు కొత్త రేషన్ కార్డులు అందించకుండా మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అర్హుడికీ సంక్షేమ ఫలాలు తక్షణమే అందిస్తున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ కార్డుల వల్ల మహిళలు రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి బయోమెట్రిక్ కోసం నిరీక్షించాల్సిన అవసరం లేకుండా చిటికెలో పని ముగుస్తుందన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చిలువేరు లక్ష్మయ్య, పెరమాండ్ల మహాలక్ష్మి దానయ్య, కర్నాటి వరలక్ష్మి పాండు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి





- న్యూ దిల్‌సుఖ్‌నగర్‌లో ఉచిత శిక్షణా సర్టిఫికెట్ల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కమల

**తొలివెలుగు, చైతన్యపురి :** మహిళలు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషియన్, మెహందీ కోర్సులను పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేతిలో నైపుణ్యం ఉన్న మహిళ కుటుంబానికి ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని అన్నారు. ఒక కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందితే దాని ప్రభావం సమాజంపై కూడా ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమ నైపుణ్యాలకు అనుగుణంగా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక పద్ధతుల వరకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ యువ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, నర్సిరెడ్డి, రాపోలు సుధాకర్, విశ్వప్రేమ్, నాగలక్ష్మి, జయశ్రీ, శోభారాణి, శిక్షకులు సునీత, భానుప్రియ, శివబిందు, అర్చన తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ ఆలయ పునర్నిర్మాణ కరపత్రిక ఆవిష్కరణ



- అక్టోబర్ 12 నుంచి 16 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు
- కరపత్రికను ఆవిష్కరించిన పుర చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** భూదాన్‌పోచంపల్లి పురపాలక పరిధిలోని పెద్దచెరువు కట్ట మైసమ్మ తల్లి నూతన ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు సంబంధించిన కరపత్రికను మంగళవారం ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి పురపాలక చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై కమిటీ ప్రతినిధులతో కలిసి కరపత్రికను విడుదల చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ముప్పిడి శీను మాట్లాడుతూ.. అక్టోబర్ 12 నుంచి 16 వరకు ఐదు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న మహాగణపతి పూజతో వేడుకలు ప్రారంభమవుతాయని, 13న దేవతామూర్తుల జలాధివాసం, క్షేత్రపాల, నవగ్రహ మండప పూజలు, మూలమంత్ర జపం, హోమాలు, పంచామృతాభిషేకం, వివిధ అధివాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 14న యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, దిష్టికుంభం, పూర్ణాహుతితో పాటు మహా అన్నదానం ఉంటుందని చెప్పారు. 15న కట్ట మైసమ్మ తల్లి కల్యాణం, సాయంత్రం బలిగంప, బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16న అయ్యప్ప దేవాలయం నుంచి కట్ట మైసమ్మ ఆలయం వరకు తొట్టెల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మెరుగు బాలకృష్ణ యాదవ్, కేసారం బాల్‌రెడ్డి, నల్ల నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి దొడ్డమోని దినేష్ యాదవ్, సహాయ కార్యదర్శులు సంకు నరసింహ, గోరుగంటి బాలయ్య, దొడ్డమోని ప్రభాకర్ యాదవ్, కోశాధికారి మోట మహేష్, సహాయ కోశాధికారి వంగూరి సైదులు, కొమ్ము చంద్రయ్య, సొల్లు శంకర్, సైదాని సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం అంజయ్య, గుణంగారి దినేష్‌రెడ్డి, పోతగల దానయ్య, కొమ్ము లక్ష్మణ్, బొక్క బాల్‌రెడ్డి, కొయ్యడ నరసింహ, గునిగంటి మల్లేష్, చేరాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలే విద్యకు తొలిమెట్టు



- 'అంగన్ మిలాన్'లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం భాస్కర్
- అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఘన సన్మానం

**తొలివెలుగు, రాజాపేట :** చిన్నారుల విద్యాభ్యాసానికి అంగన్‌వాడీ కేంద్రాలే తొలి అడుగని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం భాస్కర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాజాపేట బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'అంగన్ మిలాన్' కార్యక్రమంలో భాగంగా రాజాపేట, రఘునాథపురం అంగన్‌వాడీ కేంద్రాలను పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాశం భాస్కర్ మాట్లాడుతూ.. మాతా, శిశు సంరక్షణతో పాటు చిన్నారుల పోషణ, ప్రాథమిక విద్యలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అనంతరం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. త్వరలో నిర్వహించనున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమానికి రాజాపేట నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజాపేట సర్పంచ్ కోయ మధు, నాయకులు కస్తూరి మాధురి చంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాసోజు సంపత్, పట్టణ అధ్యక్షుడు సాధనబోయిన శంకర్, మండల ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గాండ్ల నర్సింగరావు, చలమల్లపల్లి లక్ష్మణ్, చిగుళ్ల వీరయ్య, బూత్ అధ్యక్షులు బిరు సురేష్, కాకల్ల సిద్దులు, బూరెళ్ల శ్రీనివాస్, కటికం నర్సిములు, గుజ్జ రామచంద్రం, భోగ పాండు, బీమనపల్లి రమేష్, కటికం నగేష్, మహిళా నాయకులు బూర్గు రాణి, బూరెళ్ల శ్రీవాణి, జంగా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.






# ఇసుక అక్రమార్కులపై పోలీసుల పంజా

- కామునిగూడెం వాగు వద్ద రెండు ట్రాక్టర్ల స్వాధీనం
- దర్యాప్తు వేగవంతం చేసిన ఎస్ఐ లక్ష్మీనారాయణ

**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం) :** కామునిగూడెం వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆత్మకూర్ (ఎం) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎన్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు వాగు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వాటిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వాహనాల్లో టీఎస్ 30 కే 1941 ట్రాక్టర్‌ను గుడేపురి నాగరాజు, ఏపీ 22 ఏజే 7168 ట్రాక్టర్‌ను బద్దుల మహేష్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ రెండు ట్రాక్టర్లు కామునిగూడెం గ్రామానికి చెందిన మాధ కిరణ్‌కు చెందినవిగా పోలీసులు నిర్ధారించారు. అక్రమ ఇసుక రవాణాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.




# అప్రమత్తతే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ చేసే ప్రమాదం
- అనుమానాస్పద లింకులపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ లక్ష్మీనారాయణ

**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం) :** ఆన్‌లైన్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ (ఎం) ఎస్ఐ ఎన్.లక్ష్మీనారాయణ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు నకిలీ ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, కస్టమర్ కేర్ ప్రతినిధుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. అత్యాశ, భయం, తొందరపాటును ఆసరాగా చేసుకుని బాధితుల నుంచి నగదు కాజేస్తున్నారని హెచ్చరించారు. తెలియని వ్యక్తులు పంపే లింకులను పొరపాటున కూడా క్లిక్ చేయవద్దని సూచించారు. ఓటీపీ, పాస్‌వర్డ్, ఏటీఎం, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. బ్యాంకులు, ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగినా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

- యూత్ కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు
- జలాల్‌పురంలో నూతన యూత్ కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తల పాత్ర కీలకమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ అన్నారు. మంగళవారం జలాల్‌పురం గ్రామంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్ల మహేష్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో నూతన యూత్ కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పాలకుర్ల రాజు గౌడ్, ఉపాధ్యక్షుడిగా శాపాక బాల నరసింహ, కార్యదర్శిగా గంజి రాజేశ్వర్, కోశాధికారిగా గుండ్ల అరుణ్, ప్రచార కార్యదర్శిగా రేవల్లి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వెంకటేష్ యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా యువజన నాయకులు కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, పాలకుర్ల ఆగయ్య, దేవాలయ చైర్మన్ కేసారం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శాపాక బిక్షపతి, రైతు సంఘం అధ్యక్షుడు కేసారం శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గుండ్ల శ్రీరాములు, శాపాక శంకర్, పాలకుర్ల ఉపేందర్‌గౌడ్, వార్డు సభ్యులు బైరు శివాజీగౌడ్, శాపాక బాలమణి శ్యామ్, కేసారం నరేందర్‌రెడ్డి, గడ్డం నవీన్, కంది మహేందర్‌రెడ్డి, శాపాక స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.






# పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

- పిల్లాయిపల్లి బాధితుడికి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ పత్రం అందజేత
- ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది: కళ్లెం రాఘవరెడ్డి

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని పిల్లాయిపల్లి గ్రామానికి చెందిన సుక్క నరేష్ వెన్నుముక ఆపరేషన్ కోసం భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 2.50 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ పెరమాండ్ల మహాలక్ష్మితో కలిసి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా కళ్లెం రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆపదలో ఉన్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తోట శ్రీనివాస్, బీ రెడ్డి అలేఖ్య సందీప్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడిసె భూషణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అందెల మహేష్‌యాదవ్, నాయకులు కన్జాల గణేష్, బండిగారి శేఖర్, రాజు, చుక్క రవి తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

- రేవెనపల్లి అంగన్‌వాడీలో జాతీయ పోషణ మాసోత్సవం
- సామూహిక అన్నప్రాసనలు, గర్భిణులకు శ్రీమంతాలు



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** సరైన పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని 3వ వార్డు కౌన్సిలర్ రావుల జంగయ్య అన్నారు. పోచంపల్లి పురపాలక పరిధిలోని రేవెనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జాతీయ పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ రావుల జంగయ్య చిన్నారులకు సామూహిక అన్నప్రాసనలు, గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతిరోజూ చిరుధాన్యాలు, పప్పు దినుసులు, మాంసకృత్తులు, గుడ్లు, ఆకుకూరలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటేనే కుటుంబంలో ఆరోగ్యం నెలకొంటుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని మంజుల, ఉపాధ్యాయిని విజయ, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సువర్ణ పాల్గొన్నారు.

# జిల్లా ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా సంతోష్ యాదవ్

- శివరెడ్డిగూడెం ఉప సర్పంచ్‌కు కీలక పదవి
- సన్మానించి నియామక పత్రం అందజేసిన ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా భూదాన్‌పోచంపల్లి మండలం శివరెడ్డిగూడెం గ్రామ ఉప సర్పంచ్ చిలకల సంతోష్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఆయనను శాలువాతో సన్మానించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఉప సర్పంచుల ఫోరంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు, తోటి ఉప సర్పంచులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- నూతన నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి
- టీఎంజెఎఫ్ జిల్లా నాయకుడు మీసాల సైదులు డిమాండ్



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించి, నూతన నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని టీఎంజెఎఫ్ జిల్లా నాయకుడు మీసాల సైదులు కోరారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ-ఎస్టీ కమిషన్ ప్రస్తుత పదవీకాలం ముగిసిన నేపథ్యంలో త్వరలో చేపట్టనున్న నూతన నియామకాల్లో జర్నలిజం రంగంలో విశేష సేవలు అందిస్తున్న మాదిగ, అనుబంధ కులాలకు చెందిన జర్నలిస్టులకు చైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అణగారిన వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని సైదులు తెలిపారు. గత నియామకాలకు భిన్నంగా ఈసారి రొటేషన్ విధానాన్ని అమలు చేసి అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న కమిషన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# నేరాల నియంత్రణకే నిఘా నేత్రాలు

- ముదుమాలలో సీసీ కెమెరాల వ్యవస్థ ప్రారంభం
- ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం: ఎస్ఐ నవీద్



**తొలివెలుగు, కృష్ణ :** శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్ఐ నవీద్ అన్నారు. మండల పరిధిలోని ముదుమాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను ఎస్ఐలు నవీద్, సురేందర్ ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన కెమెరాలను రిబ్బన్ కట్ చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ నవీద్ మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు నేరాలకు సంబంధించిన ఆధారాలను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా నిరంతరం నిఘా కొనసాగిస్తుందని పేర్కొన్నారు. మిగతా గ్రామాల్లోనూ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, ముఖ్య నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన ఉండాలి

- ఆశా కార్యకర్తలకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ సూచన
- రాజాపేట పీహెచ్‌సీలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష





**తొలివెలుగు, రాజాపేట :** పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడంపై ఆశా కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ సూచించారు. మంగళవారం రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారులకు అందించే వివిధ రకాల వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి చిన్నారికి నిర్ణీత వయసులో టీకాలు అందేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. టీకాలతోనే చిన్నారులను పలు వ్యాధుల నుంచి రక్షించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయరాణి, సూపర్‌వైజర్లు శ్రీను, విజయలక్ష్మి, ఎపిడమియాలజిస్ట్ నర్సింహా, ఆరోగ్య విస్తరణాధికారి భీకూ నాయక్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సేవలు అమూల్యం

- కలెక్టరేట్‌లో 36వ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు
- రాజాపేట వయోవృద్ధులకు సన్మానం.. విద్యార్థులకు పురస్కారాలు
- పాల్గొన్న అదనపు కలెక్టర్ భాస్కరరావు, అధికారులు



**తొలివెలుగు, రాజాపేట :** సమాజ అభివృద్ధిలో వయోవృద్ధులు అందించిన సేవలు, అనుభవాలు ఎంతో విలువైనవని అధికారులు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర వయోధిక, వికలాంగుల, స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో 36వ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కరరావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సెర్ప్ ప్రతినిధి శైలజ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సీహెచ్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధికి వయోవృద్ధులు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ వారి అనుభవాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సమాజ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న రాజాపేట మండలానికి చెందిన వంచ ఉపేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మిట్ట అంజయ్యలను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

# మృతుల కుటుంబాలకు ‘బీర్ల ఫౌండేషన్’ ఆసరా

- చల్లూరులో ఆరు కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యం అందజేత
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాలతో సహాయం: శాగ నవీన్ కుమార్



**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలం చల్లూరు గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు ‘బీర్ల ఫౌండేషన్’ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర బియ్యాన్ని పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి, కడవేరుగు బిక్షపతి, మహేశ్వరం నరసయ్య, మద్ది జనార్దన్, గుంటి విజయ, సట్టా రాములు కుటుంబాలకు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శాగ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 50 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి ఈ బియ్యం పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లూరు గ్రామ సర్పంచ్ రూప బాల్ నర్సయ్య, ఉపసర్పంచ్ బొంత సుధాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ చిట్కూరి గౌరయ్య, నాయకులు మునిగడప కనకయ్య, బడే ఎల్లయ్య, వార్డు సభ్యుడు గణపురం శ్రీకాంత్, మహేశ్వరం సుధాకర్, భీమగాని కృష్ణ, పెంట శ్రీహరి, కొండపాక మధు, గుంటి శ్రీరాములు, మీసా కృష్ణ, చాద బంగారి, గణపురం మార్కండేయ, సిదారపు మహేందర్, కోల కనకయ్య, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# మళ్లీ క్రషర్ కలకలం!

- చల్లూరు గుట్టలను యథేచ్ఛగా కొల్లగొడుతున్న అక్రమార్కులు
- అనుమతులు లేకుండానే తవ్వకాలు సాగుతున్నాయంటున్న స్థానికులు
- ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- గుట్టుచప్పుడు కాకుండా పనుల పునఃప్రారంభం.. క్షేత్రస్థాయి తనిఖీలకు డిమాండ్



**తొలివెలుగు, రాజాపేట :**

రాజాపేట మండలం చల్లూరు శివారులోని గుట్టల్లో క్రషర్ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 322 పరిధిలో గతంలో నిలిచిపోయిన పనులను తాజాగా గుట్టుచప్పుడు కాకుండా తిరిగి ప్రారంభించారని చెబుతున్నారు. సంబంధిత అనుమతులు లేకుండానే గుట్టలను తవ్వుతూ రాళ్లను వెలికితీస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తూ అధికారుల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


చల్లూరు గుట్టల్లో క్రషర్ యంత్రాలు.. రాళ్ల తవ్వకాలు




### అనుమతులు లేకుంటే తక్షణమే నిలిపివేయాలి:

అధికారుల తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో నిలిచిపోయిన కార్యకలాపాలు మళ్లీ ఎలా ప్రారంభమయ్యాయనే అంశంపైనా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చల్లూరు గుట్టల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### అధికారుల తనిఖీలు ఎక్కడ?

క్రషర్ కార్యకలాపాలపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రెవెన్యూ, మైనింగ్, కాలుష్య నియంత్రణ, పంచాయతీరాజ్ తదితర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. క్రషర్‌కు సంబంధించిన అనుమతులు, భూమి వివరాలు, తవ్వకాల పరిధి, రాళ్ల తరలింపు తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

### గతంలో నిలిచిన పనులు.. మళ్లీ తెరపైకి:

చల్లూరు శివారులోని గుట్టల ప్రాంతంలో గతంలో క్రషర్ కార్యకలాపాలు కొనసాగినట్లు స్థానికులు చెబుతున్నారు. వివిధ కారణాలతో పనులు నిలిచిపోయినప్పటికీ ప్రస్తుతం మళ్లీ తవ్వకాలు, రాళ్లను తరలించే ప్రక్రియ ప్రారంభమైనట్లు వారు పేర్కొంటున్నారు. ఎలాంటి హడావుడి లేకుండా రాత్రి, పగటి వేళల్లో పనులు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ కార్యకలాపాలకు ఏయే శాఖల నుంచి అనుమతులు ఉన్నాయనే విషయంపై స్పష్టత లేదని అంటున్నారు.

### అనుమతులపై అనుమానాలు:

క్రషర్ కార్యకలాపాలకు గ్రామపంచాయతీ అనుమతులు ఉన్నాయా? సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందారా? అనే అంశాలపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ముఖ్యంగా సర్వే నంబర్ 322 పరిధిలో జరుగుతున్న తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, భూ వినియోగం, పర్యావరణ నిబంధనలు, మైనింగ్ అనుమతులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

### గుట్టల తవ్వకాలతో పర్యావరణానికి ముప్పు?

సహజసిద్ధంగా ఏర్పడిన గుట్టలను భారీగా తవ్వడం వల్ల భవిష్యత్తులో పర్యావరణంపై ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుట్టల తొలగింపుతో భూస్వరూపం మారడంతో పాటు దుమ్ము, శబ్ద కాలుష్యం, భారీ వాహనాల రాకపోకలతో సమీప ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
యాదాద్రి భువనగిరి బుధవారం 07 అక్టోబర్ 2026



# రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్‌కు సన్మానం

- యాదాద్రి జిల్లా డైరెక్టర్‌గా ఎంపికైన వెంకటేశ్వర్లు రెడ్డి
- సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని పిలుపు



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం నమిల గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త మేక వెంకటేశ్వర్లు రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను నమిల గ్రామ సర్పంచ్ పులి రాజు ముదిరాజ్, ఉప సర్పంచ్ మార్క శివకుమార్ మంగళవారం శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ.. సమాజ సేవ పట్ల వెంకటేశ్వర్లు రెడ్డికి ఉన్న అంకితభావాన్ని అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తరించాలని కోరారు.

# పండుగ సాయన్న విగ్రహ కమిటీ సమావేశం

- విగ్రహ ఏర్పాటుపై ముదిరాజ్ కులస్తులతో విస్తృత చర్చలు
- నిర్మాణ పనులకు సహకరించాలని పిలుపు.. విరాళాల సేకరణ



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం కుర్రారం గ్రామంలో పండుగ సాయన్న విగ్రహ కమిటీ ప్రతినిధులు మంగళవారం ముదిరాజ్ కులస్తులతో సమావేశమయ్యారు. గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో చేపడుతున్న కార్యక్రమానికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. విగ్రహ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు, నిర్మాణ పనుల నిర్వహణ, అందుకు కావాల్సిన సహకారం తదితర అంశాలను కమిటీ ప్రతినిధులు ముదిరాజ్ కులస్తులతో వివరించారు. విగ్రహ ఏర్పాటు ద్వారా పండుగ సాయన్న సేవలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. విగ్రహ నిర్మాణ పనులను సమష్టి సహకారంతో పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా ముదిరాజ్ కులస్తుల నుంచి విరాళాలు సేకరించారు. గ్రామస్థులు, సంఘం సభ్యులు, దాతలు ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించాలని కమిటీ ప్రతినిధులు కోరారు. విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా చర్చించారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పులి చంద్రమౌళి, విగ్రహ కమిటీ అధ్యక్షుడు శివరాములు, నేమిల సర్పంచ్ పులి రాజు, నాయకులు పిట్టల జయరాం, చెరుకు కనకయ్య, రెడ్డబోయిన రాజు, యామ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభాయమానం.. రాజాపేట

- ఏకాదశి వేళ భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన
- సాయి మందిరంలో భవానంద అష్టక పఠనం.. ప్రత్యేక పూజలు



**తొలివెలుగు, రాజాపేట :** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజాపేట మండల కేంద్రంలో మంగళవారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వేకువజామున నిర్వహించిన నగర సంకీర్తనతో పురవీధులు భక్తి నామస్మరణతో మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. మర్కుక్ శ్రీ భవానంద స్వామివారి ఆశీస్సులతో, అదరాసుపల్లి శ్రీధర శర్మ పర్యవేక్షణలో రాజాపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజాపేట శాఖ అధ్యక్షుడు నంగునూరు రాజు ఆధ్వర్యంలో వేకువజామున నగర సంకీర్తన ప్రారంభమైంది. 'హరే రామ' నామజపంతో భక్తులు భజనలు చేస్తూ పురవీధుల్లో సాగారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన ప్రధాన వీధుల గుండా కొనసాగింది. మార్గమధ్యంలోని స్థానిక ఆలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి గీతాలు, నామస్మరణతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అనంతరం శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఆలయ ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవానంద అష్టకాన్ని భక్తిశ్రద్ధలతో పఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన నగర సంకీర్తన, ప్రత్యేక పూజల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో రాజాపేటలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నాళ్ల శేఖర్, కూనూరు భిక్షపతి, ఉప్పల రమేష్, బిర్రు లక్ష్మి, నాళ్ల పద్మ, బోగ లత, పరమేశ్వరి, చామకూర అరుణ పాల్గొన్నారు.



# రూ.100 కోట్ల వెంచర్ మోసంపై చర్యలేవి?

- రోడ్డున పడ్డ 700 మంది కస్టమర్లు.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అక్రమ క్రషర్‌పైనా చర్యలు చేపట్టాలి: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెఫరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లూరు శ్రీనివాసరావు



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలో రూ.100 కోట్ల రియల్ ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై అధికారులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెఫరల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం రాజాపేటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. చల్లూరు రెవెన్యూ పరిధిలోని 'శ్రీ కన్స్ట్రక్షన్ అండ్ డెవలపర్స్' లేఅవుట్ అనుమతులను డీటీసీపీ రద్దు చేసినప్పటికీ, యాజమాన్యం కొనుగోలుదారులకు తప్పుడు సమాచారం ఇస్తూ కాలయాపన చేస్తోందని శ్రీనివాసరావు ఆరోపించారు. దీంతో సుమారు 700 మంది కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై 15 రోజుల క్రితం రాజాపేట పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కొనుగోలుదారుల సొమ్మును రికవరీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా చల్లూరు సర్వే నంబర్ 322/4 పరిధిలో రాజకీయ అండదండలు, అధికారుల అవినీతితో అక్రమంగా క్రషర్ నిర్మించి నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. అక్రమంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, అక్రమంగా ఆర్జించిన ఆస్తులపై విచారణ జరపాలని కోరారు. వెంచర్ వ్యవహారంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# 'సేవా జ్యోతి' బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

- బీజేవైఎం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం
- భువనగిరి ర్యాలీకి యువత, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలి
- బీజేవైఎం జిల్లా కార్యదర్శి శాంతిరెడ్డి, మండల అధ్యక్షుడు మేకల రమేష్

**తొలివెలుగు, రాజాపేట :** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా అక్టోబర్ 7న భువనగిరిలో నిర్వహించనున్న 'సేవా జ్యోతి బైక్ ర్యాలీ'ని విజయవంతం చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు దొంకన సంపత్ కోరారు. మంగళవారం రాజాపేట బీజేపీ కార్యాలయంలో ర్యాలీ నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా బీజేవైఎం కార్యదర్శి శాంతిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ, సమర్పణ భావంతో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భువనగిరిలో నిర్వహించే బైక్ ర్యాలీకి యువత, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్‌రెడ్డి, బూర్గు శేఖర్‌రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, సర్పంచ్ కోయ మధు, సాధనబోయిన శంకర్, చిగుళ్ల వీరయ్య, కాసోజు సంపత్, బొంగోని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.






# నైపుణ్యం పెంపొందించుకుంటేనే మెరుగైన ఉపాధి





- శ్రీ చైతన్య పారామెడికల్ కళాశాల నూతన విద్యార్థులకు ఘన స్వాగతం
- వృత్తి విద్యతో అవకాశాలను అందిపుచ్చుకోవాలి: ఢిల్లీ శేఖర్‌రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** వృత్తి విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చని శ్రీ చైతన్య అకాడమీ ఆఫ్ పారామెడికల్ టెక్నాలజీ కళాశాల కరెస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఢిల్లీ శేఖర్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లోని జయశ్రీ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం కళాశాల నూతన విద్యార్థులకు స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం విద్యా అర్హతలు సాధించడం మాత్రమే కాకుండా, వృత్తిపరమైన పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రాయోగిక పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పారామెడికల్ కోర్సులకు ప్రస్తుతం మంచి ప్రాధాన్యం ఉందని, కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వైద్య రంగంలో వివిధ విభాగాల్లో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం, మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవడంతో పాటు తమ వృత్తిలో అవసరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. నాణ్యమైన శిక్షణతో ఉత్తమ పారామెడికల్ నిపుణులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కళాశాలలోకి నూతనంగా అడుగుపెట్టిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహంతో వేడుక సందడిగా సాగింది. కార్యక్రమంలో అధ్యాపకులు బొమ్మ లింగస్వామి, బాతరాజు జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- పీపల్‌పహాడ్‌లో సంఘం పెద్దలు, సభ్యుల సమక్షంలో ఎన్నిక
- అధ్యక్షుడిగా నల్లంకి మల్లేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని పీపల్‌పహాడ్ గ్రామంలో గౌడ గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని గౌడ సంఘం పెద్దలు, గీత కార్మికులు, సంఘం సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం భవిష్యత్ కార్యక్రమాలు, గీత కార్మికుల సంక్షేమం, ఐక్యతపై సభ్యులు చర్చించారు. సంఘం అధ్యక్షుడిగా నల్లంకి మల్లేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మాదగోని మల్లేష్ గౌడ్, నల్లంకి ఎట్టయ్య గౌడ్, బకనగారి మల్లేష్ గౌడ్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బకనగారి అశోక్ గౌడ్, కోశాధికారిగా దోసపాటి అశోక్ గౌడ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యదర్శులుగా నల్లెంకి రాజు గౌడ్, రోషణగారి ప్రభాకర్ గౌడ్, మాదగోని బాలకృష్ణ గౌడ్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా చిదుగుల్ల యాదయ్య గౌడ్, నల్లెంకి శంకర్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గౌడ గీత కార్మికుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. గీత కార్మికుల సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావడంతో పాటు వారి సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సంఘం సభ్యుల సహకారంతో గౌడ గీత కార్మికుల ప్రయోజనాలకు కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గ ఎన్నిక పట్ల సంఘం పెద్దలు, సభ్యులు హర్షం వ్యక్తం చేసి ఎన్నికైన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.







# కాలుష్య కోరల్లో చౌటుప్పల్..
## పచ్చని పల్లెలపై పరిశ్రమల పడగ!

- చౌటుప్పల్ చుట్టూ రసాయన కాలుష్య కోరలు.. విషతుల్యమమతున్న భూగర్భ జలాలు
- పచ్చని పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయంటున్న రైతులు
- రాత్రివేళల్లో రసాయన వ్యర్థాల అక్రమ పారబోతపై తీవ్ర ఆరోపణలు
- బోర్ల నీటిలో భారీగా పెరిగిన టీడీఎస్.. ప్రజల ఆరోగ్యంపై ఆందోళన
- పంటలు, పశుసంపద దెబ్బతింటున్నాయని గ్రామాల గోడు
- కాలుష్యకారక పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



గంగ పొంగితే ప్రతి గుండె ఉప్పొంగాలి.. పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి లభించాలి. కానీ చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పచ్చని పంట పొలాలు, పాడిపంటలతో కళకళలాడిన ప్రాంతాలు పారిశ్రామిక కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయని రైతులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా, రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాల కారణంగా గాలి, నీరు, నేల కాలుష్యానికి గురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో చౌటుప్పల్ ప్రాంతం వేగంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ పరిసర మండలాల్లో అనేక రసాయన, ఫార్మా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు పెరగాల్సి ఉండగా.. వ్యర్థాల నిర్వహణలో లోపాల కారణంగా స్థానిక ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తొలివెలుగు, చౌటుప్పల్**

**అడ్డగోలుగా వ్యర్థాల విడుదల?**

ప్రమాదకర పారిశ్రామిక వ్యర్థాలను నిబంధనల ప్రకారం శుద్ధి చేసి, నిర్దేశిత కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. అయితే కొన్ని పరిశ్రమలు నిబంధనలు పాటించకుండా రాత్రివేళల్లో ట్యాంకర్ల ద్వారా చెరువులు, కుంటలు, బహిరంగ ప్రదేశాలు, నిర్జన ప్రాంతాల్లో వ్యర్థాలను పారబోస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో లోతైన బోర్లు ఏర్పాటు చేసి వ్యర్థాలను భూగర్భంలోకి పంపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీటికి దూరమవుతున్న బోర్లు:**

చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురం, లక్కారం, కొయ్యలగూడెం, తంగడపల్లి – జైకేసారం ప్రాంతాలతో పాటు భూదాన్ పోచంపల్లి మండలంలోని దోతిగూడెం, సీతవానిగూడెం, అంతమ్మగూడెం తదితర గ్రామాల్లో భూగర్భ జలాల నాణ్యతపై గతంలో పలు పరీక్షలు నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటిలో టోటల్ డిజాల్వ్ సాలిడ్స్ (టీడీఎస్) స్థాయిలు అధికంగా నమోదైనట్లు పేర్కొంటున్నారు. మాంగనీస్, నికెల్, సీసం వంటి మూలకాల తీవ్రతపై కూడా గతంలో అధ్యయనాలు జరిగినట్లు వారు చెబుతున్నారు.

**పంటలు పండక.. రైతుల గోడు:**

భూగర్భ జలాల నాణ్యత దెబ్బతినడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు వాపోతున్నారు. కలుషిత నీటితో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు ఇవ్వడం లేదని చెబుతున్నారు. పశువులకు సైతం ఈ నీటిని వినియోగించడం ఇబ్బందిగా మారిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఏళ్లుగా పంటలు సాగు చేస్తున్నాం. గత కొంతకాలంగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. పెట్టుబడులు పెట్టినా ఫలితం కనిపించడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే భూములు అమ్ముకుని వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది" అని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

**ప్రజల ఆరోగ్యంపై ఆందోళన:**

దోతిగూడెం సహా కొన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో రసాయనాల ఘాటైన వాసనలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. తలనొప్పి, శ్వాసకోశ సమస్యలు, చర్మ సమస్యలు వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని తీవ్రమైన అనారోగ్య సమస్యలకు కాలుష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నప్పటికీ.. దీనిపై శాస్త్రీయంగా సమగ్ర వైద్య, పర్యావరణ అధ్యయనం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి:**

పారిశ్రామిక అభివృద్ధి అవసరమే అయినప్పటికీ.. ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణాన్ని పణంగా పెట్టి అభివృద్ధి కొనసాగకూడదని స్థానికులు అంటున్నారు. కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలను గుర్తించి, నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వ్యర్థాల నిర్వహణ, భూగర్భ జలాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రజలకు వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని కోరుతున్నారు. గతంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కొండా సురేఖ పీసీబీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కాలుష్య నియంత్రణపై దృష్టి సారించాలని ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా పారిశ్రామిక సంస్థలు ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహించాలని సూచించినట్లు తెలిపారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని విస్మరిస్తే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించి, కాలుష్యానికి అసలు కారణాలను శాస్త్రీయంగా నిర్ధారించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చౌటుప్పల్ మరో పటాన్‌చెరుగా మారకుండా ఇప్పటికైనా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఫిర్యాదులు.. తనిఖీలు:**

కాలుష్య సమస్యపై స్థానికులు, రైతులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు చెబుతున్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో పీసీబీ, రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా పరిశీలనలు చేపట్టి చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లోని 50కి పైగా బోర్ల నుంచి నీటి నమూనాలు సేకరించినట్లు సమాచారం. వాటి పరీక్షా ఫలితాల ఆధారంగా కాలుష్యానికి కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





# బర్రెల దొంగల ముఠా గుట్టురట్టు

- నలుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- రూ.80 వేల నగదు, ఆటో, బర్రె, సెల్‌ఫోన్లు స్వాధీనం
- చౌటుప్పల్ సీఐ జీ. మన్మథకుమార్ వివరాల వెల్లడి









**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలుచోట్ల బర్రెల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జీ. మన్మథకుమార్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిబావి ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఓ ఆటోను ఆపి తనిఖీ చేశారు. పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి విచారణలో చౌటుప్పల్ పరిధిలో జరిగిన పశువుల దొంగతనాలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితులుగా అడ్డాడి రాఘవేంద్రరావు, దాసరి యాదయ్య, అడ్డాడ శ్రీనివాసరావు, చాపల సైదులులను గుర్తించినట్లు సీఐ వెల్లడించారు. పోలీసుల విచారణలో.. ఆగస్టు 8న చౌటుప్పల్ రామ్‌నగర్ కాలనీలో రెండు బర్రెలు, మూడు దూడలను దొంగిలించినట్లు, సెప్టెంబరు 11న కాటమయ్య కాలనీలో మరో బర్రెను అపహరించినట్లు నిందితులు వెల్లడించినట్లు తెలిపారు. దొంగిలించిన పశువులను కోదాడలో విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. అలాగే ఈ నెల 4న లింగారెడ్డిగూడెం శివారులోని బర్రెల షెడ్డు తాళం పగులగొట్టి ఓ బర్రెను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం దానిని అటవీ ప్రాంతంలో దాచిపెట్టి, కోదాడ సంతకు తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు సీఐ వివరించారు. నిందితుల వద్ద నుంచి ఒక బర్రె, దొంగతనాలకు ఉపయోగించిన ఆటో (టీఎస్ 08 యూఏ 3407), మొబైల్ ఫోన్లు, రూ.80 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో విక్రయించిన బర్రెలను కూడా పోలీసులు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

**అనుమానాస్పద కదలికలపై అప్రమత్తంగా ఉండాలి:**

గ్రామీణ ప్రాంతాల్లో పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని సీఐ మన్మథకుమార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, పశువుల తరలింపు వాహనాల కదలికలు కనిపించినా, తమ పశువుల విషయంలో అనుమానం కలిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పశువుల దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




# గ్రామ భద్రతకు 'నిఘా' నేత్రాలు

- రూ.5.60 లక్షల విలువైన 26 సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రారంభించిన సీఐ మన్మథకుమార్, ఎస్ఐ నర్సిరెడ్డి
- ప్రత్యేక చొరవ చూపిన సర్పంచ్ శ్రీలత సుందర్

**తొలివెలుగు, పంతంగి :** గ్రామంలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి ధ్యేయంగా నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్, ఎస్ఐ నర్సిరెడ్డితో కలిసి అధికారికంగా ప్రారంభించారు. సర్పంచ్ శ్రీలత సుందర్ ప్రత్యేక చొరవతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పంతంగి గ్రామానికి చెందిన కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, సత్యనారాయణలు రూ.5.60 లక్షల విలువైన 26 సీసీ కెమెరాలను విరాళంగా అందించడం అభినందనీయమన్నారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, రహదారులపై ఈ నిఘా నేత్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే. పద్మజ, వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్‌రెడ్డి, మాధగోని పరమేశ్వరి, అంతటి సౌజన్య, మాజీ సర్పంచులు చీరిక సంజీవరెడ్డి, అంతటి రమేష్‌గౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఓబీసీ కులగణనపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- అక్టోబర్ 8న ఢిల్లీలో భేటీ నిర్వహించాలి
- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఐటీ కన్వీనర్ సూర్యతేజ డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** రాబోయే జనగణనలో ఓబీసీల కుల వివరాల సేకరణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఐటీ కన్వీనర్ సూర్యతేజ డిమాండ్ చేశారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను సేకరించేందుకు అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. చౌటుప్పల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగణనలో ఓబీసీ కులాలు, ఉపకులాల వివరాలను నమోదు చేసే ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని సూర్యతేజ సూచించారు. కులాల వారీగా సేకరించే సమాచారంలో పారదర్శకత, కచ్చితత్వం ఉండేలా తగిన విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సేకరించిన సమాచారాన్ని సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల రూపకల్పనలో సమర్థవంతంగా వినియోగించే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య డేటా సమన్వయంతో పాటు వ్యక్తిగత సమాచార భద్రతకు సంబంధించిన చర్యలను కూడా ముందుగానే నిర్దేశించాలని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను ప్రస్తావిస్తూ.. ఆర్టికల్ 15(4), 16(4), 340తో పాటు 338బీ, 342ఏ నిబంధనలు ఓబీసీలకు సంబంధించిన సామాజిక న్యాయం, రక్షణలు, విధాన రూపకల్పనలో ప్రాధాన్యం కలిగి ఉన్నాయని సూర్యతేజ పేర్కొన్నారు. కులగణన ద్వారా సమాజంలోని వివిధ వర్గాల సంఖ్య, సామాజిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. "మా గురించి విధానాలు రూపొందించే ముందు మా సంఖ్యను, స్థితిగతులను తెలుసుకోవాలి" అని సూర్యతేజ స్పష్టం చేశారు. ఓబీసీ కులగణన అంశంపై కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాలు, రాజకీయ పార్టీలతో చర్చించి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు.

# తెలంగాణలో కరవు పరిస్థితులు.. 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం

**హైదరాబాద్,సువర్ణ జ్యోతి::** ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది. ఛఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల (జూన్-సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి, ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది.

# దుర్గం చెరువు అభివృద్ధికి స్పెషల్ పర్పస్ వెహికల్..



- దుర్గం చెరువు అభివృద్ధికి స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు
- 140 ఎకరాల్లో అభివృద్ధి పనులకు సీఎంసీ స్థాయీ సంఘం ఆమోదం
- చెరువులోకి మురుగునీటిని అరికట్టేందుకు కొనసాగుతున్న ప్రయత్నాలు
- చింతల కుంట చెరువు పునరుద్ధరణకు రూ.21.59 కోట్లు కేటాయింపు
- పలు అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత దుర్గం చెరువు సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సిద్ధమవుతోంది. సుమారు 140 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రతిపాదనకు సోమవారం జరిగిన సీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో ఆమోదం లభించిందని అధికారులు తెలిపారు. ఈ ఎస్పీవీ ద్వారా చెరువు అభివృద్ధి ప్రాజెక్టును ప్రత్యేకంగా చేపట్టడంతో పాటు, ఈ కార్యక్రమానికి అవసరమైన నిధుల సమీకరణ కూడా సులభతరం అవుతుందని భావిస్తున్నారు. దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా అరికట్టేందుకు అధికారులు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే చెరువు చుట్టూ నాలుగు ప్రధాన మురుగునీటి మార్గాలను గుర్తించి, వాటిని అడ్డగించి శుద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. గతంలోనూ దుర్గం చెరువు చుట్టూ వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు, ఇతర ప్రజా సౌకర్యాలు కల్పించారు. తాజా నిర్ణయంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇదే సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. చింతల కుంట చెరువు పునరుద్ధరణ కోసం రూ.21.59 కోట్లు, కూకట్‌పల్లి జోన్‌లో బాక్స్ డ్రెయిన్ పనుల పూర్తికి రూ.5.95 కోట్లు, గజులరామారం సర్కిల్ ఆఫీస్ భవన నిర్మాణానికి రూ.5.18 కోట్లు కేటాయించారు. మున్సిపల్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాల కోసం తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన టీ-వర్క్స్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ)కు కూడా ఆమోదం లభించింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఎంసీ కమిషనర్ జి.శ్రీజన, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ మేరకు డెక్కన్ క్రానికల్ తన కథనంలో వెల్లడించింది.

# బార్ల యజమానులకు నష్టం లేదు..

- ప్రివిలేజ్ ఫీజుతో బార్ల యజమానులకు నష్టం లేదన్న మంత్రి జూపల్లి
- వినియోగదారులపై పడేది స్వల్ప భారమేనని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ హయాంలో మద్యం ఆదాయం 260 శాతం పెరిగిందని వెల్లడి

**హైదరాబాద్,సువర్ణ జ్యోతి::** రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ల యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, వినియోగదారులపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మద్యం ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప, వినియోగం పెద్దగా తగ్గదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరం అప్‌గ్రేడ్ అయినందున, ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగానే ఇక్కడా బార్ లైసెన్సులను జారీ చేశామని తెలిపారు. ఈ కొత్త రుసుము బార్ యాజమాన్యాలకు నష్టం కలిగించేది కాదని ఆయన పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం రూ.10,000 కోట్ల నుంచి రూ.36,000 కోట్లకు, అంటే దాదాపు 260 శాతం పెరిగిందని జూపల్లి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ఆదాయం ప్రస్తుతం రూ.40,000 కోట్లుగా ఉందని వివరించారు. ప్రభుత్వం చట్ట ప్రకారమే ముందుకు వెళుతోందని, మద్యం ఉత్పత్తికి నీటి కొరత ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com